


# ప్రయాణిస్తే...!

కస్తూరి బాబు

ఈ రోజుల్లో ఎక్కడికైనా ప్రయాణం చేయాలంటే ఈ రద్దీవల్ల చాలా భయమేస్తుంది. అందులోను బస్సు ప్రయాణమైతే మరీను. ఎక్కడి సంగతో ఎందుకుగాని ఒంగోలు నుంచి మాత్రం పొదిలి బస్సులో ప్రయాణం చేయలేం. ఎప్పుడు చూసినా బస్సులు రద్దీగానే వుంటాయి. డైరెక్టుగా పోయే బస్సులే కాకుండా నాలుగైదు ఊర్లకు పోయే బస్సులు కూడా పొదిలి మీదనుంచే వెళతాయి. అయినా సరే ఖాళీ వుండదు.

ఆ రోజు ఒంగోలులో పని చూసుకుని బస్ స్టాండ్‌కు వచ్చాను. మార్కాపురం పోయే బస్సొకటి బయలుదేరడానికి సిద్ధంగా వుంది. ఈ బస్సులో పోదామనుకున్నాను కాని బయట నుంచి చూస్తేనే తెలిసిపోయింది, కూర్చోటానికి కాదు కదా కనీసం నిలబడటానికి కూడా చోటు లేదని. యిదిపోతే మళ్ళీ రెండు గంటలవరకు బస్సులేదు. అంతసేపు ఈ బస్‌స్టాండులో కాళీగా వుండటమంత బుద్ధితక్కువ పని యింకొకటి లేదు. అందుకే ఎలాగో ఒకలా పోవచ్చునని లోపలికి ప్రవేశించాను.

"నమస్కారం మాస్టారూ! యిక్కడ కూర్చోండి" కండక్టరు ప్రక్కనే కూర్చున్న ఓ కుర్రాడు లేచి అన్నాడు. అతనెవరో నాకు గుర్తుకు రాలేదుగాని అతనెప్పుడో నా దగ్గర చదువుకుని వుంటాడనుకున్నాను.

"ఫర్వాలేదు లేవోయ్" మనస్సులో కూర్చోవాలనివున్నా పైకి మాత్రం కొంచెం బెట్టు చేసాను.

"మీరు నిలబడలేరు సార్. మీరు కూర్చోండి నేను నిలబడతాను" అని నన్ను కూర్చోబెట్టాడు.

ఈ లెక్చరరుద్యోగం కనీసం ఈ మాత్రం గౌరవాన్నయినా కలిగించిందని మనస్సులో కాసేపు ఆనందపడ్డాను. అప్పటికే అందరికీ టికెట్లిచ్చినట్లున్నాడు కండక్టరు తాపీగా కూర్చున్నాడు. నా దగ్గర కూడా టికెట్ రేటుకంటే ఓ ముప్ఫయి పైసలు (అలవాటుగా) ఎక్కువ తీసుకుని టికెట్టిచ్చాడు. బ్రైమయినట్లుంది. బస్సు బయలు దేరింది.

బస్సులో డ్రయివర్, కండక్టర్లకు సీట్లు భద్రంగా వుంటాయి కాబట్టి మిగతావాళ్ళు ఎట్లా ఏడిస్తే ఏంలే అనుకుని ఎవరు చేయి చూపి ఆపినాసరే వాళ్ళని ఎక్కించుకుంటున్నారు. ఇంతకు ముందయితే బస్సు కాళీగా వున్నాసరే ఆపకుండా పోయేవారు. కాని ఈ బోనస్ సిష్టం వల్ల రోడ్డు ప్రక్కన నిలబడి ఎవరైనా నల్గురు మాట్లాడుకుంటుంటే ఆపి మరీ అడుగుతారు వస్తారా అని (వాళ్ళు ప్రయాణికులు కాక పోయినా).

సరిగ్గా రింగ్‌రోడ్ దగ్గరకి వచ్చేసరికి రోడ్డుమీద ఓ ముసలమ్మ రెండు చేతిసంచులను పట్టుకుని నిలబడి వుంది. ప్రజా సేవయే మా కర్తవ్యం అనుకునే ఈ యిద్దరూ ఆమెను యధావిధంగా ఎక్కించుకున్నారు. ఆమె లోపలికొచ్చేదారిలేక గుమ్మం దగ్గరే నిలబడిపోయింది.

డోర్‌ని గట్టిగా వేసి దాన్ని తాడుతో కట్టి (ఊడిపోకుండా) కండక్టరు ముసలమ్మని "ఎక్కడికెళతావ్" అని అడిగాడు.


"సీమకుర్తి బాబూ" అందామె.

"అయితే రెండు రూపాయలివ్వు" అంటూ ఆజ్ఞ జారీచేసి "యింకెక్కడ ఆపకు గురూ" అని డ్రయివర్‌తో చెప్పాడు.

బస్సు బయలుదేరింది.

"ఏం డబ్బులిమ్మంటుంటే... వినపడ్డం లేదా చెవుడేమిటె" అంటూ అరుస్తున్నాడు కండక్టరు. వీడిప్రక్కన ఎందుకు కూర్చున్నాన్రా భగవంతుడా అనుకున్నాను. అతను మాట్లాడుతుంటే వర్షం కురుస్తుంది. చుట్టకంపు కొడుతుంది. అసలు మనిషే కండక్టరులా లేడు. నలిగిపోయి వున్న కాకీ డ్రస్ వేసుకున్నాడు. జుట్టంతా చిందరవందరగా వుంది. గడ్డం కూడా మాసిపోయి వుంది. కండక్టరు సీటులో కూర్చున్నాడు కాబట్టి కండక్టరనుకోవాలిగాని అదే ఏ రోడ్డుమీదో కన్పిస్తే లారీ క్లీనరనుకుంటాం. ఆదాయం బాగానే వుంటుందిగా! కాస్త నీట్‌గా వుండకూడదూ ?

ఆ ముసలమ్మ చేతుల్లో వున్న సంచుల్ని కాళ్ళ దగ్గర పెట్టుకుని ఓ సంచిలోని చిన్న గుడ్డమూట తీసి విప్పుతోంది. బస్ స్పీడుగా పోతుందేమో ఆ ముసలమ్మ నిలబడలేకపోతోంది. బస్ డోర్ పట్టుకుని మేనేజ్ చేస్తోంది. ఆ ముసలమ్మ మీద వూరకే రుసరుసలాడుతున్నాడు కండక్టరు. దానికి కారణం వేరే చెప్పనక్కరలేదు. ఆమె టికెట్ రెండు రూపాయలది. ఆమెవల్ల కండక్టరుకు లాభంలేదు. వాళ్ళకి ఒకటి ఎనభై, రెండు ఎనభై... యిట్లాంటి టికట్లయితే అంతా లాభమే. అందుకే అలాంటి పాసంజర్లను వీళ్ళు చాలా గౌరవంగా చూస్తారు. ఒకవేళ ఆ పాసంజర్లు పొరపాటున చిల్లర అడిగారా వాళ్ళని అంతమందిలోను పరువు తీస్తారు. వాళ్ళని అడిగి భంగ పడేకంటే ఆ డబ్బులతో టీ తాగామనుకుంటే సరిపోతుందని చాలామంది ఊరుకుంటారు.




## తనదాకా వస్తేనే...

ఎలా అయితే కష్టపడి ఆ మూట విప్పి రెండు రూపాయల కాగితాన్ని తీసి కండక్టరు కిచ్చింది. కండక్టరు టికెట్ యిచ్చాడు. ఆమె జాగ్రత్తగా ఆ టికెట్‌ను మూటలో కట్టి సంచిలో పెట్టేసింది.

టికెట్ల ప్రహసనం పూర్తయింది. ఎస్సార్ తీసాడు వ్రాయడానికి. వ్రాస్తూ వ్రాస్తూ ఏమనుమానం వచ్చిందో టికెట్స్ చేతిని తీసి చూసి కాసేపు తనలోతాను గొణుక్కుని ముసలమ్మని టికెట్ చూపించమన్నాడు. ఆమె మళ్ళీ కష్టపడి ఆ మూట విప్పి టికెట్ తీసి యిచ్చింది. బస్ స్పీడుగా పోతోందేమో డోర్‌ని గట్టిగా పట్టుకుంది. కాస్సేపు ఆ టికెట్ వంక, ఎస్సార్‌వంక చూసి ఆ టికెట్‌ను డోర్ పట్టుకున్న ముసలమ్మచేతిలో పెట్టేసాడు. ఆమె ఆ టికెట్‌ను గట్టిగా పట్టుకుందామనే లోపలే అది గాలిలోకి ఎగిరిపోయింది. "అయ్యో నా టికెట్" అంటూ ఆమె అరవడం ప్రారంభించింది. కండెక్టరు బస్సు ఆపించేసాడు. "ఏం అంత వదులు చేతులా... ఆ మాత్రం ఆ టికెట్‌ను పట్టుకో లేవ్వ" అంటూ కండక్టరు ఆమెపై అరుస్తున్నాడు. బస్సు ఆగడంతో ముసలమ్మ, కండెక్టరు బస్సు దిగారు. కాని ఆ టికెట్ అప్పటికే ఎక్కడికో ఎగిరి పోయివుంటుంది. యింకేం దొరుకుతుంది? ఒకసారి బస్సు వెనక్కి వెళ్ళి తిరిగొచ్చాడు కండక్టరు.

ఆ ముసలమ్మ మీద కోపంతో మండిపడి మళ్ళీ టికెట్ కొనమన్నాడు. తన దగ్గర యింక డబ్బుల్లేవంది. టికెట్ పోవడం తన తప్పు కాదంది. టికెట్ ఎగిరి పోవడానికి నువ్వే కారణమంది. తను ముందు దాచుకున్నానంది. ఎన్ని చెప్పినా కండక్టరు వినలేదు. టికెట్ కొనాలన్నాడు. కొనకపోతే యిక్కడ దింపేసి పోతానన్నాడు. ధాంతో ఆమె గొల్లుమంది. మధ్యలో యిక్కడ దింపేస్తే తన గతేమిటంది. ఈ గొడవంతా బస్సులో వున్నవాళ్ళకి చాలా చికాకును కల్గిస్తోంది. అసలే నిలబడి ప్రయాణం చేస్తున్నారు. కూర్చున్న వాళ్ళకి కూడా సుఖం లేదు. అంతా విసుక్కుంటున్నారు. "పోనీ యిక్కడ ఎక్కించుకో గురూ. వచ్చే స్టేజి పెర్నమిట్ట గదా? అక్కడ దించేద్దాం" అన్నాడు డ్రయివర్.

అక్కడ దింపితే మాత్రం తను ఎలా వెళతానంది. చీమకుర్తిలో దించుతానంటేనే బస్సు ఎక్కుతానంది. ముసలమ్మ గట్టిదే ననిపించింది. నిజానికి ముసలమ్మ తప్పేమీలేదు. తప్పంతా కండక్టరుదే. అతని నిర్లక్ష్యంవల్లే ఆ టికెట్ ఎగిరి పోయింది. కాని ముసలమ్మది తప్పని దబాయిస్తున్నాడు. పోనీ నేను కలగజేసుకుని చెపుదామంటే నా మాట వింటాడా? నా కెందుకులే గొడవని వూరుకున్నాను. బస్సులో చాలా మంది ఈ ఆలస్యాన్ని భరించలేక తలొక పావలా యిస్తామన్నారు. దాంతో కండక్టరు, ముసలమ్మ బస్సెక్కారు. అందరూ యిచ్చిన (నేను కూడా) రెండు రూపాయిలు తీసుకుని టికెట్ ముసలమ్మకిచ్చి బస్సును పోనిమ్మన్నాడు.

చీమకుర్తిలో బస్సు ఆగడంతో ముసలమ్మ దిగిపోయింది. అక్కడ చాలా మంది దిగిపోవడంతో బస్సంతా కాళీ అయిపోయింది. ఎక్కేవారు లేకపోవడంతో బస్సు వెంటనే బయలు దేరింది. డ్రయివర్ చాలా స్పీడుగా పోనిస్తున్నాడు.

రామతీర్థం దాటిన తర్వాత కండక్టరు ఎస్సార్ క్లోజ్ చేసాడు. ఒకసారి లేచి బస్సులో వున్న పాసంజర్లను లెక్క పెట్టుకున్నాడు. తర్వాత వెళ్ళి డోర్ దగ్గర నిలబడి తల బయటకి పెట్టి కాస్సేపు అటూ యిటూ చూసి అక్కడే వున్న అడ్డకమ్మీమీద కూర్చుని బేగ్‌లోని కేష్ లెక్కపెడుతున్నాడు. ముందు వందలు, ఏభైలు లెక్కపెట్టి బేగ్‌లో పెట్టుకున్నాడు. తర్వాత పదులు లెక్క పెడుతున్నాడు. బయటనుంచి వీస్తున్న గాలికి గుమ్మందగ్గరగావున్నాడేమో అతని తలంతా చిందరవందరగా ఎగురుతోంది.

స్పీడుగా పోతున్న బస్సుకు ఏమడ్డం వచ్చిందో డ్రయివర్ ఒక్కసారిగా స్టీరింగ్‌ను ప్రక్కకితిప్పి బస్సును రోడ్డుప్రక్కగా పోనిచ్చి మళ్ళీ రోడ్డుమీదకు తీసుకొచ్చి ముందుకు పోనిచ్చాడు.

అంత స్పీడులో ఆ సంఘటన జరిగేసరికి కండక్టరు బాలన్సు నిలుపులేక ముందుకు పడబోయి చేతిలోని నోట్లను వదిలేసి డోర్ పట్టుకున్నాడు. అలా చెయ్యడంలో ఒకటి రెండు నోట్లు బయటికి ఎగిరిపోయాయి. మిగిలినవి లోపలే పడ్డాయి.

"హోల్డాన్" అంటూ ఒక్క అరుపు అరిచి బస్సాపించాడు కండక్టరు.

"ఏంటి గురూ" అన్నాడు డ్రయివర్ తాపీగా.

"నా బొంద, అంత స్పీడులో ప్రక్కకి తిప్పకపోతే స్లోగా పోనిస్తే నీ సొమ్మేంపోయింది. యిప్పుడు చూడు నోట్లు ఎగిరిపోయాయి" అన్నాడు కోపంగా.

డ్రయివరు, కండక్టరు బస్సుదిగారు. అప్పటికే అవి చాలాదూరం వెళ్ళిపోయి వుంటాయి. దొరకలేదు. డ్రయివర్ బస్సెక్కి రివర్స్‌లో కొంతదూరం వెనక్కిపోనిచ్చాడు. అయినా ఫలితం దక్కలేదు. కండక్టరు ఏడుపు ముఖం పెట్టాడు. అతన్నిచూస్తే నాకు జాలి కలిగింది. ముసలమ్మ టికెట్ ఎగిరిపోతే ఆమెను తిట్టి నానా హంగామాచేసి మళ్ళీ టికెట్ కొనిపించిన ఈ కండక్టరు తను చేసిన పనికి ఏం జేయాలో తెలియక వచ్చి తనసీట్‌లో కూర్చుని బస్సును పోనిమ్మన్నాడు. ఏదైనా తనదాకా వస్తేనే గాని తెలియదంటారు. ★